సాక్షి
ఏలూరు
బుధవారం । 21 । ఆగస్టు । 2024



మూడోసారి నాట్లు
ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు వరి రైతులు కుదేలయ్యారు. ఇప్పటికే రెండు సార్లు నాట్లు వేయగా, వర్షాల వల్ల చేలు మునిగి కుళ్లిపోయాయి. 8లో ▸



ఆర్బీకేల నిర్వీర్యం
గత ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతులకు అండగా నిలవగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎరువులను సొసైటీల ద్వారా విక్రయిస్తూ ఆర్బీకేలను నిర్వీర్యం చేస్తోంది. 8లో ▸



పెలికాన్‌లతో కొల్లేరు కళకళ
ఆటపాక పక్షుల కేంద్రంలో వందలాది పెలికాన్ పక్షులు చేస్తున్న కిలకిలరావాలు బోటు షికారు చేస్తున్న పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. 8లో ▸

కొల్లేరులో దౌర్జన్యకాండ

కొల్లేరు రాజకీయం రాజుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైఎస్సార్ సీపీ మద్దతుదారులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలను టార్గెట్ చేశారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేయాలన్నా.. కొల్లేరు అక్రమ చెరువుల సాగులో గ్రామస్తులకు వాటాలు దక్కాలన్నా.. వైఎస్సార్ సీపీ స్థానిక ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాల్సిందే. లేదంటే వారితో పాటు గ్రామం మొత్తాన్ని టార్గెట్ చేస్తారు. ఇంకా ఐదేళ్ల అధికారం మాదే.. ఏం చేసినా చెప్పుకునే దిక్కే ఉండదు అంటూ కొల్లేరు ప్రజాప్రతినిధులను పచ్చ నేతలు బెదిరింపులకు దిగుతున్నారు. వీటికి లొంగని వారిపై కొల్లేరు పెద్దల ద్వారా ఒత్తిళ్లు తెచ్చి రాజీనామాల బాట పట్టిస్తున్నారు. ఇప్పటికే ఏలూరు రూరల్ మండలంలో ముగ్గురు స్థానిక ప్రజాప్రతినిధులు రాజీనామా చేయగా, మరో ముగ్గురిపై ఒత్తిళ్లు తెచ్చి రాజీనామాకు సిద్ధం చేశారు.

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అతి పెద్ద మంచినీటి సరస్సుగా ఖ్యాతిగాంచిన కొల్లేరుపై కూటమి నేతల కన్ను పడింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దెందులూరు, కై కలూరు, ఉంగుటూరు, ఉండి నియోజకవర్గాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలో 77,138 ఎకరాల విస్తీర్ణంలో కొల్లేరు ఉంది. నూతన ఏలూరు జిల్లా పరిధిలో 83 గ్రామాల్లో ఉండగా ఒక్క ఏలూరు రూరల్ మండలంలో 21 ఎకరాల విస్తీర్ణం ఎనిమిది గ్రామ పంచాయితీల పరిధిలో కొల్లేరు ఉంది. ఈ క్రమంలో గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు అన్ని స్థానాలూ కై వసం చేసుకున్నారు. రూరల్ పరిధిలో 15 సర్పంచ్ స్థానాలు, 11 ఎంపీటీసీ స్థానాలు వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గెలిచారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఏలూరు రూరల్ మండలంలో టీడీపీ దాష్టీకాలకు తెరలేచింది. ప్రధానంగా కొల్లేరు ఆదాయ వనరులను టార్గెట్ చేసి మరీ నేతలను బెదిరించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ప్రత్తికోళ్లలంకలో 460 ఎకరాల కొల్లేరు ఆక్రమిత చెరువును ఊరంతా ఉమ్మడి సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో అక్రమిత

- చెరువులు కావాలంటే పదవులు వదులుకోవాల్సిందే
- ఏలూరు రూరల్ మండలంలో టీడీపీ దాష్టీకం
- ఇద్దరు సర్పంచ్‌లు, ఒక ఎంపీటీసీ రాజీనామా
- మరో ముగ్గురు రాజీనామాకు రంగం సిద్ధం
- అధికార పార్టీ ఆదేశాలను అమలు చేస్తున్న కొల్లేరు పెద్దలు
- బెదిరింపుల ద్వారా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను వేధిస్తున్న వైనం



చెరువు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ సర్పంచ్, ఎంపీటీసీలు రాజీనామా చేయాలి. లేదంటే ఆటవీ శాఖకు అక్రమిత చెరువును కొట్టించే స్తామని టీడీపీ నేతల నుంచి కొల్లేరు పెద్దలకు హెచ్చరికలు వచ్చాయి. దీంతో చేసేదేమీ లేక ఇద్దరు ప్రజాప్రతినిధులు రాజీనామా చేశారు. అదేవిధంగా గుడివాకలంక సర్పంచ్‌ను కూడా రాజీనామా చేయించారు. మరో ముగ్గురు స్థానిక ప్రజాప్రతినిధులతో ఇప్పటికే హెచ్చరించి రాజీనామాలు సిద్ధం చేశారు.

లంక గ్రామాలే టార్గెట్

కొల్లేరు ఆక్రమిత ప్రాంతంలో గ్రామస్తులే ఉమ్మడి సాగు చేసుకోవడం కొన్ని దశాబ్దాలుగా ఉన్న పరిస్థితి. ప్రభుత్వాలు ఎన్ని మారినా సాగు మాత్రం యథాతథంగానే ఉంటుంది. కానీ ఈ పర్యాయం టీడీపీ నేతలు బరితెగింపు రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేరిట అనుచరులు బెదిరింపులకు దిగారు. ఎనిమిది లంక గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సర్పంచ్, ఎంపీటీసీలు ఉండటానికి వీల్లేదని, ఉంటే గ్రామాలు బాగా ఇబ్బందులు పడతాయని, కనీసం ఒక్క రోడ్డు కూడా వేయబోమని ప్రత్యక్షంగానే బెదిరింపులకు దిగుతున్నారు. లంక గ్రామాల్లో ఆక్రమిత చెరువులను టార్గెట్ చేసి గ్రామస్తులను ఒప్పుకునేలా చేస్తున్నారు. లేని పక్షాన అధికారులకు ఫిర్యాదు చేసి హడావిడి బెదిరింపులకు దిగుతున్నారు.

న్యూస్‌రీల్

సర్దుబాటులో లోపాలను సవరించాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియలో లోపాలను సవరించిన అనంతరమే సర్దుబాటు ప్రక్రియ కొనసాగించాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓ అబ్రహంను కోరారు. మంగళవారం ఈ మేరకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేయకపోవడం, కనీసం ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించకుండా చేస్తున్న పని సర్దుబాటు వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. పని సర్దుబాటు కౌన్సెలింగ్‌లో స్కూల్ అసిస్టెంట్‌లతో పాటు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల సర్దుబాటు కూడా ఒకేసారి జరపకపోవడం సరికాదన్నారు. లోపభూయిష్టమైన ఇటువంటి విధానాలను సరిచేసి సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలిసిన వారిలో పీఆర్‌టీయూ నాయకులు పువ్వుల ఆంజనేయులు, పామర్తి ఏసురాజు, ఏపీటీఎఫ్ నాయకులు బీఏ సాల్మన్‌రాజు, బి.రెడ్డి దొర ఉన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా బాలకృష్ణ ప్రసాద్



అవార్డు అందుకుంటున్న బాలకృష్ణ ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహానేత వైఎస్సార్ ప్రారంభించిన జేఎన్‌టీయూ కాకినాడ 17 సంవత్సరాల్లో తొలిసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో నగరానికి చెందిన ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.బాలకృష్ణ ప్రసాద్ బెస్ట్ పెర్ఫార్మింగ్ ప్రిన్సిపాల్ అవార్డును అందుకున్నారు. మంగళవారం కాకినాడలోని యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన ఆవిర్భావ కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ కె.రామమోహనరావు, జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అందజేశారు. జేఎన్‌టీయూకే పరిధిలో గుర్తింపు పొందిన 180 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి బాలకృష్ణ ప్రసాద్ ఒక్కరే ఈ అవార్డును అందుకోవడం విశేషం. బాలకృష్ణ ప్రసాద్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొనుగోళ్లలో కంపెనీల ప్రాతినిధ్యం పెరగాలి



కొయ్యలగూడెం కేంద్రంలో పొగాకు వేలం ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు కొనుగోళ్లలో కంపెనీల ప్రాతినిధ్యం పెరగాలని రైతులు కోరుతున్నారు. మంగళవారం అంకాలగూడెం క్లస్టర్ పరిధిలో వేలం నిర్వహణ అధికారిని గ్రేసీ మార్గరెట్ ఆధ్వర్యంలో వర్జీనియా కొనుగోళ్లు నిర్వహించారు. క్లస్టర్ పరిధికి చెందిన 1,086 బేళ్లను రైతులు విక్రయానికి పెట్టగా అందులో 79 బేళ్లు వెనక్కి మరలాయి. అత్యధిక ధర రూ.399, అత్యల్ప ధర రూ.235 పలికింది. పది కంపెనీలు ప్రాతినిధ్యం వహించినప్పటికీ రెండు కంపెనీల ప్రాతినిధ్యం కొనుగోళ్లలో ఎక్కువగా ఉందని కంపెనీలు మరింత పోటీ పడాలని రైతులు కోరుతున్నారు. కొనుగోళ్లు ప్రారంభమైన కొద్ది రోజుల వరకు సుమారు ఇరవై కంపెనీల వరకు పోటీ పడగా, ఇప్పుడు కంపెనీల ప్రాతినిధ్యం తగ్గిపోవడం వలన మిడిల్ గ్రేడ్ పొగాకుకు ఆశించిన మద్దతు ధర లభించడం లేదని వాపోతున్నారు. మరో ఇరవై రోజుల్లో కొనుగోళ్లు ముగుస్తాయని అధికారులు పేర్కొంటున్నారని, అయితే రైతుల వద్ద ఇంకా పొగాకు మిగిలి ఉందన్నారు. ఈ నేపథ్యంలో కంపెనీల ప్రాతినిధ్యం పెరిగేలా బోర్డు అధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

3లోగా ఉపాధ్యాయ ఓటు నమోదుకు దరఖాస్తు



ఉపాధ్యాయ ఓటర్ల నమోదుపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): రాష్ట్ర శాసనమండలి తూర్పు, పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు సెప్టెంబర్ 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంఈఓలు, ఎంపీడీఓలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ఉపాధ్యాయ ఓటర్ల నమోదుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పనకు ఎన్నికల కమీషన్ జారీచేసిన షెడ్యూల్ ప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నూతన ఓటర్ల నమోదుకు ఓటర్ల ఫారం–19 సెప్టెంబర్ 3వ తేదీలోగా అందజేయాల్సి ఉంటుందన్నారు. ఓటర్ల జాబితాపై క్లైయిమ్స్ అభ్యంతరాలు దాఖలుకు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 15 వరకు అవకాశం ఉందన్నారు. అభ్యంతరాలను అక్టోబర్ 30 నాటికి పరిష్కరించి తుది ఓటర్ల జాబితాను నవంబర్ 6న ప్రచురిస్తామన్నారు.

బోటింగ్ ప్రమాదాల నివారణకు చర్యలు

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో బోటింగ్ ప్రమాధాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం బోటింగ్ ప్రమాదల నివారణ చర్యల్లో భాగంగా రెవెన్యూ, పర్యాటక, బోటింగ్, అగ్నిమాపక, పోలీస్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పాపికొండల ప్రాంతంలో విహార యాత్రాస్థలంగా ప్రసిద్ధి చెందిన పేరంటాలపల్లి వద్ద మినీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. అదే విధంగా బోటింగ్ ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. బోటింగ్ నిలుపుదల, కొనసాగించే సమయాలను కలెక్టరేట్‌కు సమాచారం తెలియజేయాలని స్పష్టం చేశారు.

శిశుగృహ నిర్వహణపై సంతృప్తి

ఏలూరు (టూటౌన్): నగరంలో నిర్వహిస్తున్న శిశుగృహా సేవలపై కలెక్టర్ వెట్రిసెల్వి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక శిశుగృహాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించి బాలబాలికల వివరాలు ఆరోగ్య పరిస్థితి, పోషకాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిశు గృహాకు వచ్చిన పిల్లలను అవసరమైన వారికి దత్తత ఇవ్వడం ద్వారా శిశుగృహాంపై నమ్మకం కలుగుతుందన్నారు.

వసతి గృహంలో పాఠాలు బోధించిన కలెక్టర్

ఏలూరు (టూటౌన్): శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల వసతి గృహాలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహంలో వసతి పొందుతున్న 63 మంది 7 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు వీధి బాలలను ఆత్మీయంగా పలుకరించి వారికి అందుతున్న సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులతో మమేకమై వివిధ పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహనను వివిధ ప్రశ్నల రూపంలో అడిగి తెలుసుకున్నారు.

విద్యా సంస్థల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

- ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్
- విద్యా సంస్థల ప్రతినిధులతో సమావేశం

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో కళాశాలలు, విద్యాసంస్థల్లో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ సూచించారు. నగరంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ప్రతి పాఠశాల, కళాశాల ప్రాంగణంలో, విద్యాసంస్థలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటం ద్వారా ప్రమాదం, సంఘటనలు చోటుచేసుకుంటే నిందితులను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. బాలికలు, విద్యార్థినులపై ర్యాగింగ్, ఇతర నేరాల కట్టడి కోసం ప్రతి కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీలను నియమించాలని సూచించారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేలా ప్రోత్సహిస్తూ గూగుల్ ఫార్ములీ తయారు చేస్తున్నామని, సైబర్ నేరాలను నిరోధించేందుకు, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి విద్యాసంస్థలో నో హెల్మెట్, నో ఎంట్రీ అనే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. విద్యాసంస్థల్లో ఈవ్ టీజింగ్ పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ, ఏలూరు త్రీటౌన్ సీఐ కే.శ్రీనివాసరావు, కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తుకు 6 వరకు గడువు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 6వ తేదీతో గడువు ముగుస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యా ర్థులు మాత్రమే అర్హులన్నారు. ఈ పరీక్ష వచ్చే డిసెంబర్ 8వ తేదీన జరుగుతుందని, పరీక్ష రుసుము ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని, దరఖాస్తు చేసుకోవడానికి ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదన్నారు. పరీక్ష రాసే సమయానికి అన్ని ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు.

● పొంగిన కొండవాగులు



పోలవరం వద్ద ఇసుక కాలువ నీరు పొంగి ప్రవహిస్తున్న దృశ్యం

పోలవరం మండలంలో మంగళవారం తెల్లవారుజామున ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. దీంతో కొండవాగులు పొంగి ప్రవహించాయి. ఇసుక కాలువ, పేద్రాల కాలువ ఉప్పొంగడంతో పలు మార్గాల్లో రోడ్లపై వర్షం నీరు ప్రవహించి రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. పోలవరంలోని ఇసుక కాలువ ప్రభావంతో పొలాలు నీటమునిగాయి. గుంజవరం, గార్లగొయ్యి మార్గాలలోని లోలెవిల్ కాజ్‌వేపై నుంచి కొండవాగుల నీరు ప్రవహించింది.

– పోలవరం రూరల్



గుంజవరం వద్ద కాజ్‌వేపై ప్రవహిస్తున్న కొండవాగుల నీరు

దిక్కుతోచని స్థితిలో పత్తి రైతు

- గోదావరి వరదల వల్ల వేల ఎకరాల్లో పంట నష్టం
- మండలంలో ప్రతి ఏటా 5 వేల ఎకరాల పైబడి సాగు
- ప్రత్యామ్నాయ పంటల వైపు వేలేరుపాడు రైతుల దృష్టి



వరద తగ్గిన తరువాత ఎండిపోతున్న పత్తి

కుక్కునూరు: ప్రకృతి ప్రకోపంతో విలీన మండలంలో పత్తి రైతులు విలవిలాడిపోతున్నారు. గడిచిన మూడేళ్లుగా ప్రకృతి ప్రకోపం కారణంగా రైతులు పత్తి పంటను సాగు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. 2022లో గోదావరి వచ్చిన భారీ వరదలతో అసలు పంట నామరూపాలే లేకుండా తుడిచిపెట్టుకుపోగా, 2023లో సరైన సమయానికి వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ ఏడాది జూన్‌లో ఐదు వేల ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటగా, మొక్క దశలో ఉండగా గోదావరి వరద రూపంలో తుడిచిపెట్టుకుపోయింది. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టగా, 20 రోజుల పాటు వరద పంట చేలను చుట్టుముట్టడంతో పత్తి మొక్కలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని రైతులు తలలు పట్టుకుంటున్నారు. పోనీ మరోసారి విత్తనాలు వేద్దామంటే అదును దాటిపోతుందని ఆవేదన చెందుతున్నారు. ఒకప్పుడు పంట వేసి నీటి కోసం ఆకాశం వైపు చూసిన రైతులకు ఇప్పుడు అదే నీరు వరద రూపంలో నష్టానికి గురిచేస్తుండడంతో ఏం చేయాలో తెలియక దిక్కు తోచని స్థితిలో పత్తి రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. పత్తి నష్టం నుంచి కోలుకునేందుకు రైతులు మిర్చి సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. అయితే పెట్టుబడి ఎక్కువ అవడంతో పాటు పెరిగిన కౌలు రేట్లతో పంట దిగుబడి సమయానికి గిట్టుబాటు ధర ఉంటుందో లేదోనన్న భయం రైతులను వెంటాడుతోంది. ఇప్పటికే ప్రభుత్వం భూములకు పోలవరం పరిహారం అందించిన నేపథ్యంలో వ్యవసాయం చేసి చేతులు కాల్చుకోవడం ఎందుకని భావించి పరిహారం పొందిన రైతులు జామాయిల్ సాగుకు మొగ్గు చూపుతున్నారు. కాగా చిన్నసన్నకారు రైతులే ఎక్కువగా పత్తి పంటపై ఆధారపడాల్సి వస్తోందని, ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బంది పడుతున్న సన్నకారు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మూడు ఎకరాల్లో పంట నష్టపోయా



నేను జూన్‌లో మూడు ఎకరాల్లో పత్తి పంట వేశా. ఎకరానికి రూ.10వేల చొప్పున పెట్టుబడి పెట్టా. ఇది కాక మందుల కోసం మరికొంత ఖర్చు చేశాను. పత్తి మొక్క దశలో ఉండగా ఇటీవల గోదావరి వరద వల్ల పంట నీట మునిగి ఎండిపోయింది. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– బంధం దుర్గారావు
ఉప్పర మద్దిగట్ల గ్రామం, కుక్కునూరు మండలం

మూడేళ్లుగా నష్టపోతున్నా



2022 నుంచి ఇప్పటివరకు గోదావరి వరదతో ప్రతి ఏడాది పత్తి రైతులు నష్టపోతూనే ఉన్నారు. ప్రభుత్వం కూడా పరిహారం ఇవ్వకపోవడంతో వ్యవసాయం చేసేందుకు అప్పులు చేయక తప్పని పరిస్థితి. ఖాళీగా ఉండలేక వ్యవసాయం చేసి నష్టపోతున్నాం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– మోతే వీరయ్య, పత్తి రైతు, కుక్కునూరు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై కారు ఢీకొని ఓ మోటార్‌సైక్లిస్ట్ మృతి చెందాడు. చింతలపూడి మండలం పట్టాయిగూడెంకు చెందిన తొమ్మండ్రు లాజరు (54) తన కుమారుడు ఏలూరు శివారు వట్లూరులో నివాసం ఉండడంతో అతడ్ని చూసేందుకు వచ్చాడు. పనులు ముగించుకుని ఇంటికి మోటారు సైకిల్‌పై తిరిగి వెళుతూ వట్లూరు నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లగా వేగంగా వస్తున్న కారు ఢీకొంది. గాయపడిన లాజరును ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఆర్‌టీసీ డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు టౌన్: మానసిక వేదనతో ఒక ఆర్‌టీసీ డ్రైవర్ తీవ్ర ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన కొప్పినీడి చరణ్‌శ్రీనివాస్ ఆర్‌టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఉన్నాడు. అతని భార్యతో ఏడేళ్ల క్రితం విడాకులు తీసుకోవటంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. తీవ్ర అనారోగ్యంతో ఇటీవల మూడు నెలలు పాటు ఉద్యోగానికి సెలవు పెట్టాడు. ఒంటరి జీవితాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్థాపంతో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అప్పుల బాధ తాళలేక..

ఏలూరు టౌన్: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మిలట్రీమాధవరం గ్రామానికి చెందిన పీ లక్ష్మణరావు (55) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయానికి బ్యాంకుల్లో అప్పులు తీసుకున్నాడు. సరైన పంట దిగుబడి రాకపోవటంతో, వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బంధువులు గమనించి తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా మంగళవారం మృతిచెందాడు. తాడేపల్లిగూడెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తట్టుకోలేక..

ఏలూరు టౌన్: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు రామకృష్ణాపురానికి చెందిన నాగకళ్యాణి (32), భర్త మాణిక్యాలరావు దంపతులు. నాగమణి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం కడుపునొప్పి తట్టుకోలేక ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక పంపిణీ ప్రారంభం

కుక్కునూరు: ప్రభుత్వం చేపట్టిన ఫ్రీ ఇసుక విధానం మంగళవారం మరలా పునః ప్రారంభమైంది. ఇసుక అమ్మకాల ప్రక్రియ ప్రారంభమైన తరువాత అధికారపార్టీ నాయకులు ఇసుకను లారీలలో తెలంగాణకు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలింపు చేపట్టడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక పంపిణీ ప్రక్రియను నిలిపివేశారు. కాగా అలా నిలిచిన ఇసుక పంపిణీ ప్రక్రియ మరలా ప్రారంభమైంది. గత అనుభవాల దృష్ట్యా రెవెన్యూ, పోలీస్ అధికారులు దగ్గరుండి పంపిణీ ప్రక్రియ చేపట్టారు. పాత ధర ప్రకారమే ఇసుక అమ్మకాలు జరుగుతుండగా ఇతర ప్రాంతాలకు ఇసుకను వాహనాలలో తీసుకెళ్లేందుకు టన్ను ఇసుకకు కిలోమీటర్ దూరానికి రూ.7.50 నిర్ణయించినట్టు తహసీల్దార్ పెద్దిరాజు చెప్పారు.

ప్రకృతిపైనే భారం.. మూడోసారి నాట్లు

- అధిక వర్షాలకు రెండుసార్లు కొట్టుకుపోయిన నాట్లు
- అప్పులు చేయలేక గగ్గోలు పెడుతున్న రైతులు
- సాయం అందించని కూటమి ప్రభుత్వం





తన చేను పోయిందని ఆవేదన వెలిబుచ్చుతున్న గుమ్మళ్ళరెడ్డియ్య, వెల్లమిల్లి ఆయకట్టులో మూడోసారి నాట్లు వేసిన దృశ్యం

ఉంగుటూరు: ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలకు రైతులు కుదేలయ్యారు. రైతులు నాట్లు వేసిన ప్రతిసారి భారీ వర్షాలు కురండంతో అవి కొట్టుకుపోతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు ఈ విధంగా జరగడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అసలే పెట్టుబడి సాయం లేక అక్కడా ఇక్కడా అప్పులు తెచ్చి సాగు పనులు ప్రారంభిస్తుంటే ప్రకృతి సైతం తమపై పగబట్టిందని వాపోతున్నారు. అన్నదాతలు ఇన్ని కష్టాలు పడుతున్నా చేయూత అందించాల్సిన కూటమి ప్రభుత్వం సానుభూతి పలుకులు తప్ప సాయం మాత్రం చేయడం లేదు. జూన్, జూలై మాసాల్లో కురిసిన అధిక వర్షాలకు ఒక్క ఉంగుటూరు మండలంలోనే వెయ్యి ఎకరాలకు పైగా నాట్లు దెబ్బతిన్నాయి. దీంతో సుమారు 150 మంది రైతులు నష్టపోయారు. నాట్లు వేసిన వారం రోజుల నుంచి 25 రోజుల వ్యవధిలోనే నాట్లు దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా చాలా నష్టపోయారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు నష్టపోయారు. తరువాత మళ్లీ నాట్లు వేయడం.. మళ్లీ వర్షాలు కురవడంతో రైతులు రెండోసారి కూడా నష్టపోయారు. అయినా కూటమి ప్రభుత్వం చలించలేదు. ప్రభుత్వ ఆంక్షలు అడ్డుతగలటంతో అధికారులు సైతం రైతులకు ఏమి చేయలేకపోయారు. ఊడ్చిన 30 రోజులు దాటితే గాని రైతులకు నష్టం ఇవ్వకూడదని ప్రభుత్వ నిబంధన ఉంది. దీంతో రైతులకు సానుభూతి తప్ప ఒరిగిందేమి లేదు. ఉంగుటూరు మండలం బాదంపూడి, వెల్లమిల్లి, కాకర్లమూడి, రావులపర్రు, దొంతవరం, కైకరం శివారు భూముల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇందులో కొందరు రైతులు నారుమళ్లు కోల్పోయారు. వ్యవసాయం తప్ప మరోటి చేతకాని రైతన్నలు చేసేదిలేక అక్కడ ఇక్కడ అప్పులు తెచ్చి ప్రకృతిపై భారం వేసి మూడోసారి నాట్లు వేస్తున్నారు.

నాట్లు కొట్టుకుపోయాయి



ఈ ఏడాది అధిక వర్షాలు వలన రైతులు చాలా నష్టపోయారు. నేను నాట్లు వేసి దెబ్బతిన్నాను. నాలేగా చాలామంది రైతులు నాట్లు వర్షాలకు కొట్టుకుపోయాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు. – కానూరి శ్రీను, కాకర్లమూడి రైతు

ప్రభుత్వం నుంచి సాయం లేదు



అధిక వర్షాలు రైతులను బాగా దెబ్బతీశాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో భారీ వర్షాలకు నీరు వెళ్లే మార్గం లేక నారుమళ్లు పూరిగా దెబ్బతిన్నాయి. దీంతో చాలామంది రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ప్రభుత్వం నుంచి సాయం ఏమి అందలేదు. కొవ్వలి మహేష్, రైతు, దొంతవరం

పారదర్శకత లోపించిన పని సర్దుబాటు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియలో పారదర్శకత లోపించిందని పీఎంటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ. సుమంత్ ఒక ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవో 53ను అమలు పరచకపోవడమే కాక జీవో 117ను మాత్రమే అమలు పరచడం దురదృష్టకరమన్నారు. సర్దుబాటు ప్రక్రియలో ప్రతి పాఠశాలలో మిగులు ఉపాధ్యాయుల వివరాలు, డెఫిసిట్ పాఠశాలల వివరాలు అన్నీ యాజమాన్యం వారీగా ఏర్పాటు చేయకుండా అన్ని యాజమాన్యాలను కలిపి ఒకే జాబితాలో పొందుపరచడం వల్ల యాజమాన్యంతో సంబంధం లేకుండా అధికారులు కౌన్సిలింగ్‌లను నిర్వహించి అదే యాజమాన్యంలో సర్దుబాటు చేయలనే నిబంధనను తుంగలో తొక్కారన్నారు. దీనితో కొన్ని చోట్ల మాతృ యాజమాన్యం వారికి అన్యాయం జరిగిందని, కొన్ని చోట్ల మున్సిపల్ టీచర్స్ ప్రతిఘటనతో కౌన్సిలింగ్ ఆగిపోయిందన్నారు. హిందీ ఉపాధ్యాయులకు సర్దుబాటులో 10వ సెక్షన్ వద్ద బయాలజీతో పాటు ఒక హిందీ పోస్ట్ కేటాయిస్తున్నారు కానీ 16వ సెక్షన్లో అదే బయోలజీ వారితో పాటు హిందీ పోస్ట్ లేకపోవటం వల్ల సదరు హిందీ పోస్టును కోల్పోతున్నారన్నారు. ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లకు యూపీ స్కూల్ ఆప్షన్ చూపటంతో వారందరు యూపీలకు తరలిపోయి, హైస్కూల్లో ఉన్న ఖాళీలను తదుపరి అంచెలో ఎస్‌జీటీలతో నింపుకోవాల్సి వస్తుందని, దీనితో యూపీ స్కూల్లో బోధన చేయాల్సిన ఎస్‌జీటీలు హైస్కూల్‌లకు, హైస్కూల్‌లో బోధించాల్సిన ఎస్ఏలు యూపీలకు తరలిపోవటం శోచనీయమన్నారు.

ఎస్సైలు, సీఐల బదిలీలు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీలు చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ శాఖలో బదిలీల పర్వం కొనసాగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం 11 మంది ఎస్సైలకు స్థానచలనం చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరో ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
షేక్ మదీనా భాషా	ఏలూరు టూటౌన్	ఏలూరు వన్‌టౌన్
కే.శుభశేఖర్	పెదపాడు	ఆగిరిపల్లి
బీ.సురేంద్రకుమార్	ఆగిరిపల్లి	వీఆర్, ఏలూరు జిల్లా
ఆకుల మణికుమార్	చేబ్రోలు	గణపవరం
వీ.వెంకటేశ్వరరావు	గణపవరం	వీఆర్, ఏలూరు జిల్లా
షేక్ జబీర్	వీఆర్, ఏలూరు జిల్లా	జంగారెడ్డిగూడెం
జీ.జ్యోతిబసు	జంగారెడ్డిగూడెం	వీఆర్, ఏలూరు జిల్లా
పాలంగి చెన్నారావు	ధర్మాజీగూడెం	తడికలపూడి
కగ్గా వెంకన్న	బుట్టాయగూడెం	ధర్మాజీగూడెం
పీ నవీన్‌కుమార్	ఏలూరు వన్‌టౌన్	జీలుగుమిల్లి
డీ.దుర్గామహేశ్వరరావు	వీఆర్, ఏలూరు జిల్లా	బుట్టాయిగూడెం
సీఐ బదిలీలు		
ఎం.రమేష్‌బాబు (సీఐ)	వీఆర్, ఏలూరు	కుక్కునూరు
వీ.శ్రీనివాసరావు (సీఐ)	కుక్కునూరు సర్కిల్	వీఆర్, ఏలూరు రేంజ్

చిట్టి చేతులు.. గట్టి సాయం

భీమడోలు: వారంతా పదో తరగతి లోపు చిన్నారులు.. తమతో పాటు చదువుకున్న ఓ విద్యార్థిని లివర్ దెబ్బతిని ప్రాణాప్రాయ స్థితికి చేరుకోవడంతో వారంతా తల్లడిల్లిపోయారు. కాలేయ మార్పిడి చేయించుకోలేని ఆ కుటుంబానికి పాఠశాలలోని విద్యార్థులు తమ చిట్టి చేతులతో పెద్ద సాయం చేసి తమ దాతృత్వాన్ని చాటుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారు. భీమడోలులోని మానస ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆరో తరగతి చదువుకున్న పోలసానిపల్లికి చెందిన మామిడి జ్ఞానేశ్వరి తల్లి కోట దుర్గకు సచివాలయ ఉద్యోగం రావడంతో ఏలూరులో నివాసముంటుంది. ప్రస్తుతం ఏలూరులోని ఓ ప్రైవేటు స్కూలులో 9వ తరగతి చదువుకుంటూ నృత్య ప్రదర్శనల్లో మేటిగా నిలిచింది. ఇటీవల మామిడి జ్ఞానేశ్వరి తీవ్ర అనారోగ్యం బారిన పడడంతో వైద్యులు కాలేయ మార్పిడి చేయాలని రూ.40 లక్షలు అవసరమని తెలియజేసారు. ప్రభుత్వం సాయం రూ.8 లక్షలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర మానవతావాదులు రూ.12 లక్షల వరకు ఆర్థిక సాయం చేశారు. ఆ సొమ్ములతో తల్లి దుర్గ తన కాలేయంలోని కొంత భాగాన్ని కుమార్తె జ్ఞానేశ్వరికి ఇచ్చింది. ప్రస్తుతం తల్లి, కుమార్తెలిద్దరు చెన్నైలో ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఇంకా రూ.20 లక్షలు అవసరమయ్యాయి. అంత సొమ్ము లేని ఆ కుటుంబం బిడ్డను కాపాడుకునేందుకు సామాజిక మాధ్యమాలు, పత్రికల ద్వారా ఆర్థిక సాయాన్ని అర్జించారు. తన పాఠశాలలో చదువుకుని తీవ్ర కష్టాల్లో ఉన్న ఆ చిన్నారిని కాపాడుకునేందుకు తమ వంతు సాయం చేయాలని తలంచారు. భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో పాఠశాలలోని చిన్నారులు, టీచర్లు, సిబ్బంది, డ్రైవర్లు, క్లీనర్లు అంతా కలిసి రూ.2,26,050 అందించి తమ మానవత్వాన్ని చాటారు. పాఠశాలలో మంగళవారం సాయంత్రం జరిగిన ఓ కార్యక్రమంలో జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులకు ఆ మొత్తాన్ని చెక్ రూపంలో అందించారు.



విద్యార్థిని వైద్య ఖర్చులకు చెక్కు అందిస్తున్న ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్రకుమార్, టీచర్లు, విద్యార్థులు

సోషల్ మీడియాలో ప్రచారం అవాస్తవం

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు



జంగారెడ్డిగూడెం: వ్యాపారుల ఇబ్బందుల దృష్ట్యా తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వందనపు వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పారిశుధ్యం పేరుతో షాపుల ముందు డ్రెయిన్‌పై ఉన్న సిమెంట్ ప్లేట్‌లను ధ్వంసం చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే విధంగా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించి రూ.1.30కోట్లకు పైగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ క్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా తాను వ్యాపారస్తుల ఇబ్బందులను ప్రస్తావిస్తూ మాట్లాడినట్లు చెప్పారు. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించి అవినీతికి పాల్పడ్డారని, ఇందులో ఎమ్మెల్యే, ఎంపీలకు ఎటువంటి సంబంధం లేదని చెప్పాను. అయితే సోషల్ మీడియాలో దీనిని వక్రీకరిస్తూ ఎంపీ, ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడ్డారని అర్థం వచ్చేలా ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలోని ప్రచారాన్ని తాను ఖండిస్తున్నట్లు తెలిపారు.

పంట నమోదు సక్రమంగా చేపట్టాలి



వట్లూరులో పంట నమోదును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

పెదపాడు: ఎలాంటి తప్పిదాలు లేకుండా పంట నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పీ ధాత్రిరెడ్డి అన్నారు. పెదపాడు మండలంలోని వట్లూరు, వేంపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న పంట నమోదు ప్రక్రియను మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రైతులు సాగుచేస్తున్న వరి రకం వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ధాన్యం సేకరణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. పంట నమోదు ప్రక్రియలో వాస్తవ సాగుదారుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయ సహాయకుల పంట నమోదు ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎలాంటి ఇతర శాఖల బాధ్యతలు అప్పజెప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ బాషా, పెదపాడు మండల వ్యవసాయ అధికారి వీ ప్రదీప్, కుమార్, గ్రామస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



మహిళ అనుమానాస్పద మృతిపై విచారణ



చనుబండ శ్మశానవాటికలో విచారణ చేస్తున్న అధికారులు

చాట్రాయి: మహిళ అనుమానాస్పద మృతిపై మండల మేజిస్ట్రేట్ తహసీల్దార్ డి ప్రశాంతి మంగళవారం విచారణ చేపట్టారు. మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన కందుల జయలక్ష్మి (29) ఏప్రిల్ 6న తన ఇంటిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని శ్మశాన వాటికలో దహనం చేశారు. తన కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని ఆమె తండ్రి కందుల కృష్ణ అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హత్య జరిగిన రోజున మృతురాలికి ఎవరెవరు ఫోన్ చేశారో విచారణ చేయాలని కోరారు. అయితే దీనిపై కేసు నమోదు చేయలేదు. దీంతో తన కూతురు అనుమానాస్పద మృతిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ కందుల కృష్ణ ఇటీవల ఇంటెలిజెన్స్ అధికారులకు, జిల్లా ఎస్పీకి, మంత్రి పార్థసారధికి ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చాట్రాయి తహసీల్దార్ డి ప్రశాంతి, వైద్యాధికారి ముద్దుల నరశింహారావు విచారణ చేపట్టారు. మహిళ అనుమానాస్పద మృతిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు.

సెప్టెంబరు 18 వరకు 'గాలికుంటు' టీకాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జిల్లాలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 20వ తేదీ నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారని, రైతులు తప్పనిసరిగా తమ పశువులకు ఈ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించి వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 నాటికి ఈ వ్యాధిని నియంత్రించాలని, 2030 నాటికి వ్యాధిని నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ జంతువ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా. జి నెహ్రూబాబు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం గోజాతి – 1,35,607, గేదెజాతి – 5,06,110 పశువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ప్రతి మండలంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది రెండు నుంచి మూడు టీములుగా ఏర్పడి ఈ టీకాలను రైతుల ఇంటి వద్దకు వెళ్లి పశువులకు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు టి.గోవిందరాజు, కిరణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పవిత్రోత్సవం పరిపూర్ణం



శ్రీవారి ఆలయ యాగశాలలో మహాపూర్ణాహుతిని నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఆలయంలో ఏడాది పొడవునా తెలిసీ తెలియక జరిగిన తప్పులకు ప్రాయశ్చిత్తం నిమిత్తం నిర్వహించిన ఈ ఉత్సవాలు నాలుగు రోజులు ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా ఉదయం ఆలయంలో పవిత్రావరోహణ, శ్రీ మహా పూర్ణాహుతి హోమం, అనంతరం మహదాశీర్వచనాన్ని ఆలయ అర్చకులు, పండితులు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీవారి ములవిరాట్, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు, ఉత్సవమూర్తులపై ఉంచిన దివ్య పవిత్రాలను అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ తొలగించారు. అనంతరం వివిధ దినుసులతో శ్రీ మహాపూర్ణాహుతి హోమాన్ని అర్చకులు నేత్రపర్వంగా నిర్వహించారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని గత నాలుగు రోజులుగా ఆలయంలో నిలిపివేసిన నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను బుధవారం నుంచి పునరుద్ధరించనున్నట్లు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. భక్తులు గమనించాలని ఆయన కోరారు.

వృద్ధుల దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణమూర్తి

ద్వారకాతిరుమల: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి కోరారు. ద్వారకాతిరుమలలోని శ్రీ వేంకటేశ్వర బ్రాహ్మణ నిత్యాన్నదాన సదనం సమావేశ మందిరంలో మంగళవారం సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుకునూరి రామచంద్రరావు నివేదికను తెలియజేశారు. సభలో నారాయణమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు–వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం 2007ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రెవెన్యూ డివిజనల్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులను అమలుపరచడంలో జరుగుతున్న జాప్యాన్ని తొలగించి, సత్వరమే వయోవృద్ధులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబర్ 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని కోరుతూ తీర్మానించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పెలికాన్ పక్షుల కిలకిలలు



ఆటపాక పక్షుల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇనుపస్టాండ్లపై పెలికాన్ పక్షులు

కైకలూరు: పెలికాన్ పక్షుల కిలకిలలతో కొల్లేరు కళకళలాడుతోంది. పెలికాన్ ప్యారడైజ్‌గా పేరుపొందిన ఆటపాక పక్షుల కేంద్రంలో పక్షుల విహారానికి అటవీశాఖ 289 ఎకరాల్లో చెరువును ఏర్పాటు చేసింది. ఇవి సంతానోత్పత్తి చేయడానికి 150 కృత్రిమ ఇనుపస్టాండ్లను నిర్మించారు. ఇటీవల వీటిలో 60 స్టాండ్లు దెబ్బతిన్నాయి. పక్షుల కేంద్ర అభివృద్ధి నిధులు రూ.20 లక్షలలో భాగంగా వీటిని ఇటీవల అటవీశాఖ ఏర్పాటు చేసింది. వాటిపై పెలికాన్ పక్షులు నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. బోటు షికారులో వెళుతున్న పర్యాటకులు స్టాండ్లపై వందలాది పెలికాన్ పక్షులను చూస్తూ నయనానందం పొందుతున్నారు. ప్రస్తుతం ఆటపాక పక్షుల కేంద్రంలో 3000 పైబడి పెలికాన్ పక్షులు ఉన్నాయి. అటవీశాఖ డెప్యూటి రేంజర్ జీవీవీ జయప్రకాష్ మాట్లాడుతూ అక్టోబరు నెల నుంచి లక్షలాదిగా వలస పక్షులు కొల్లేరుకు చేరుతాయని చెప్పారు.